క్లుప్తంగా

'ప్రవేశ రుసుం పెంచితే తప్పకుంటాం'

తిర్యాణి: మండలంలోని చింతలమాదర జలపాతానికి వచ్చే పర్యాటకులకు విధించే ప్రవేశ రుసుం పెంచితే ఈటీసీ కమిటీ సభ్యులం జలపాత నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటామని చైర్మన్ తుంరం గోపాల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జలపాతం వద్ద పర్యాటకుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే ప్రవేశ రుసుం పెంచాలని చూడడం సరికాదన్నారు.

కౌటాల సీఐగా రమేశ్



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్

కౌటాల: కౌటాల సీఐగా ముత్యం రమేశ్ మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. కౌటాల సీఐగా విధులు నిర్వహించిన సాధిక్ పాషా బదిలీపై వెళ్లడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో సీఐగా విధులు నిర్వహించిన ముత్యం రమేశ్ కౌటాల సీఐగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను కౌటాల ఎస్సై మధుకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కౌటాల సర్కిల్ పరిధిలోని సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై మధుకర్, పోలీసులు ఉన్నారు.

తిర్యాణి ఎస్సైగా మాధవ్

తిర్యాణి: మండల ఎస్సైగా టి.మాధవ్‌ను నియమిస్తున్నట్లు శుక్రవారం రాత్రి రామగుండం కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా మాధవ్ సిర్పూర్(యూ) ఎస్సైగా విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్సై చుంచు రమేశ్ మంచిర్యాల జిల్లా తాళ్ల గురిజాల ఎస్సైగా బదిలీ అయ్యారు.

'శాంతి భద్రతలను కాపాడుతాం'



సీఐ రమేశ్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

జైనూర్: జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ప్రజల శాంతి భద్రతలకు సహకారం అందిస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన సీఐ రమేశ్‌కు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్సై ఉద్ధవ్ ముండే, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'డ్రగ్స్ వినియోగంతో అనర్థాలు'



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

దహెగాం: డ్రగ్స్ వినియోగంతో అనారోగ్యం బారిన పడడంతో పాటు అనేక అనర్థాలు కలుగుతాయని ఎస్సై రాజు అన్నారు. శనివారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు డ్రగ్స్, సైబర్ క్రైం, డయల్ 100, షీ టీం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతచదువులు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో రిజ్వానా, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎక్కాహం

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో 24 గంటల పాటు ఎక్కాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అభయ్ ఆచార్య స్వామివారికి అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, మంత్రపుష్పాన్ని నిర్వహించి ఎక్కాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు ఉదయం ఎక్కాహం ముగింపు కార్యక్రమం సందర్భంగా ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

16న సామూహిక వరలక్ష్మి వ్రతం

కౌటాల: మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో ఈ నెల 16న సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆలయంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం ఉంటుందన్నారు. ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రహదారి కష్టాలు

- నడక నరకప్రాయం
- ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు
- పట్టించుకోని అధికారులు



పగిలిపోయిన కల్వర్టు



బురదమయంగా దారి

కెరమెరి: మండలంలోని ఆగర్‌వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, నాగల్‌గొంది గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో 105 కుటుంబాలకు చెందిన సుమారు 400 మంది నివసిస్తున్నారు. వారు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం కెరమెరి, ఆసిఫాబాద్‌లకు వెళ్లక తప్పని పరిస్థితి ఉంది. కానీ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆదివాసీలు అనేక తంటాలు పడుతున్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

వర్షాకాలంలో చాలా కష్టం..



దారి మధ్యలోని చెరువు గుండా వెళ్తున్న మహిళలు

దారి పొడవునా కచ్చా, మట్టిరోడ్డు ఉండడం వల్ల వర్షాకాలంలో ఆరోడ్డంతా బురదమయంగా మారుతోంది. అనేక చోట్ల ఏర్పడ్డ గుంతల్లో వర్షపునీరు చేరడంతో కొలనులను తలపిస్తున్నాయి. కాగా వానాకాలంలో ఈ దారిలో నడవడం కూడా కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఆటంకం..

మండల పరిధిలోని కొలాంగూడ, నాగల్‌గొంది గ్రామాలకు వెళ్లాలంటే వానాకాలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, చెరువులు దాటాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

కష్టంగా నడక



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు మొత్తం కోతకు గురైంది. కెరమెరికి వెళ్లాలంటే చాలా కష్టమవుతుంది. గతంలో మట్టిరోడ్డు వేసినప్పటికీ వరద నీటితో కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి సీసీ లేదా బీటీ రోడ్డు వేయాలి.

– సిడాం ధర్మూ, పీవీటీజీ సూపర్‌వైజర్

వరినాట్లకు వలస కూలీలు!



దండేపల్లి: వానాకాలం సాగులో భాగంగా దండేపల్లి మండలంలో వరినాటు పనులకు బీహార్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన కూలీలు వలసొచ్చారు. గతంలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు వచ్చే వలసకూలీలు, ఈసారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కూడా వచ్చారు. మహిళలు, పురుషులు అందరూ వరినాట్లు వేస్తున్నారు. ఇక్కడ వరినాట్లు కేవలం మహిళలు మాత్రమే వేస్తారు, వలస కూలీలు, మహిళలతో పాటు, పురుషులు కూడా నాట్లు వేయడం ఇక్కడి వారికి కొత్తగా అనిపిస్తుండటంతో కొందరు వింతగా చూస్తున్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లి శివారులో ఓ పొలంలో వలస కూలీలు నాటు వేస్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

'ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న జాడి దేవరాజ్

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేద ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందకుండా పోయాయన్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి, బాబురావు, రాజేందర్, పోషన్న, ఆదిలక్ష్మి, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పుంజాల శివశంకర్ జయంతి



శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ 95వ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం స్థలంలో సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పని చేశారని, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచి, అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ కేబినెట్‌లో రెండుసార్లు మంత్రిగా పనిచేశారన్నారు. మున్నూరుకాపులను ఐక్యం చేసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించి సంఘం బలోపేతం కోసం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. నాయకులు సురేశ్, వెంకటేశ్, సతీశ్, గణపతి, జక్కయ్య, శంకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పోశన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి



జామినిలో మాట్లాడుతున్న మోహళే దత్తా

జైనూర్: అన్నాభావు సాఠే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహళే దత్తా అన్నారు. శనివారం మండలంలోని జామిని గ్రామంలో నిర్వహించిన అన్నాభావు సాఠే జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాత్రింబవళ్లు పనిచేసిన అన్నాభావు సాఠేకు భారతరత్న పురస్కారంతో గౌరవించాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు భాలేరావు నారాయణ్, భాలేరావు శివాజీ, గిత్తే పండరి, నాయకులు తదితరులు ఉన్నారు.

కదిలే స్పీడ్‌బ్రేకర్లు..!

- రోడ్లపై తిష్ట వేస్తున్న పశువులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని యజమానులు
- నియంత్రించని అధికారులు



కౌటాల-బెజ్జూర్ ప్రధాన రహదారిపై మూగజీవాలు

కౌటాల: జిల్లాలో కౌటాల మండల కేంద్రం కొన్నేళ్లుగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మండల కేంద్రం చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలకు మధ్యలో ఉంది. మండలంలోని ఆయా గ్రామాల్లో, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లో ఉద్యోగాలు చేసేవారు సైతం కౌటాల మండల కేంద్రంలోనే ఇళ్లను అద్దెకు తీసుకొని ఉంటున్నారు. దీంతో వాహనాల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. కానీ మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై పశువులు తిష్ట వేసి ఉండడంతో మండలవాసులకు తిప్పలు తప్పడం లేదు.

రోడ్డుపైనే సంచారం..

మండల కేంద్రంలో మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పశువులు రహదారిపై పడుకోవడం, రోడ్డుపై గంటల కొద్ది నిలిచి ఉండటంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మూగజీవాల సంరక్షణపై యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్లపై వదిలిపెడుతున్నారు. దీంతో పశువులు స్పీడ్ బ్రేకర్లుగా తయారయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలో మేకలు, పశువుల యజమానులు వాటిని ఇష్టారీతిన వదిలేస్తుండడంతో రహదారిపై గుంపులుగా సంచరిస్తున్నాయి.

ఇబ్బందుల్లో వాహనదారులు

రహదారులపై రేయింబవళ్లు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పశువులను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల రాత్రిపూట పశువులు రహదారులపైనే నిద్రిస్తున్నాయి. దీంతో వాహనదారులు చీకట్లో మూగజీవాలను ఢీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. కౌటాల మార్కెట్ ఏరియా, కుమురం భీం చౌరస్తా, బస్టాండ్ ప్రాంతంలో పశువులు వాహనాలకు మొబైల్ స్పీడ్ బ్రేకర్లుగా మారాయి.

పట్టింపులేని అధికారులు

రహదారులపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్న మూగజీవాలను నియంత్రించడంలో ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారు. వాహనచోదకులు, ప్రజలు వీటి వల్ల ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. మూగజీవాల యజమానులకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం వసూలు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

మూగజీవాలు రహదారులపై సంచరిస్తుండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పశువులు రోడ్డుపై తిష్ట వేసి వాహనాలకు అడ్డంగా వస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపైనే పశువులు నిద్రిస్తున్నాయి. యజమానులు మూగజీవాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ప్రకాశ్, తాటిపల్లి

నక్కలపల్లి లోతొర్రెపై వంతెన నిర్మించాలి



ధ్వంసమైన లోతొర్రె వంతెనను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: వర్షాల కారణంగా దెబ్బతిన్న నక్కలపల్లి లోతొర్రెపై బ్రిడ్జిని నిర్మించి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ కూలిన వంతెనను శనివారం బీజేపీ నాయకులు పరిశీలించి ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 15రోజుల క్రితం వాగుకు మరమ్మతులు చేస్తానని చెప్పి ఇప్పటివరకు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా వెంటనే మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నం, నాయకులు దుర్గం నర్సింహులు, కందుల వెంకటేశ్, పెద్దింటి లచ్చన్న, మహేశ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


రోడ్డుకు మరమ్మతు చేయించిన యువకుడు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అనిల్‌రాథోడ్

లింగాపూర్: మండలంలోని జాముల్‌దరా నుంచి పూల్‌సింగ్‌తండా, దంపూర్ వరకు వెళ్లే రోడ్డుకు పూల్‌సింగ్ గ్రామానికి చెందిన అనిల్‌రాథోడ్ అనే యువకుడు తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో అంబులెన్స్‌లు సైతం నడవలేని పరిస్థితులు ఉండడంతో అనిల్ రాథోడ్ రోడ్డుకు మట్టిపోయించి మరమ్మతులు చేయించారు.

నిరుపయోగంగా 'ఎత్తిపోతలు'



ఈ చిత్రాన్ని చూస్తుంటే రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లా కనిపిస్తోంది కదూ..! కానీ ఇది ఒక ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్. కౌటాల మండల కేంద్రం నుంచి తాటిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉంది. గుండాయిపేట్ ఎత్తిపోతల పథకంలో భాగంగా దీన్ని నిర్మించారు. ఎత్తిపోతల పథకం పని చేయకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.

– చింతలమానెపల్లి/కౌటాల

నేతకానీలకు సముచిత స్థానం కల్పించాలి

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు సముచిత స్థానం కల్పించాలని, నేతకాని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు డిమాండ్ చేశారు. దండేపల్లిలో శనివారం సంఘనాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిందని, ఇందులో భాగంగా ఎస్సీ వర్గీకరణలో నేతకానీల వాటా కోసం మనమంతా ఐక్యతగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం గ్రామగ్రామాన కమిటీలు వేసుకుని, సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. మండల ఇన్‌చార్జిలు ఇసాకర్, సాయికుమార్ పాల్గొన్నారు.

'మునుగోళ్ల' సందడి



లింగాపూర్ మండలం మాన్కుగూడలో శనివారం మునుగోళ్లు దర్శనమిచ్చాయి. గిరిజన పిల్లలు వెదురు కట్టెలతో మునుగోళ్లు తయారు చేసి వాటిపై నడుస్తూ సందడి చేశారు. శ్రావణ మాసానికి ముందు వచ్చే అమావాస్య నుంచి ప్రారంభమయ్యే మునుగోళ్ల(కోడంగ్‌లు)ను నెలరోజుల పాటు నిర్వహించనున్నారు.

– లింగాపూర్

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



మాట్లాడుతున్న పోర్ల వెంకటేశ్

కెరమెరి: ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పోర్ల వెంకటేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వర్గీకరణ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీ పరీక్షలతో పాటు ఇప్పటి వరకు నిర్వహించిన పోటీ పరీక్షల ఉద్యోగ భర్తీలు సైతం ఎస్సీ వర్గీకరణ ప్రకారంగానే చేయాలన్నారు. ఈ నెల 13న ఎస్సీ వర్గీకరణపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సాగర్, ఆదర్శ్, కల్యాణ్, వేణు తదితరులు ఉన్నారు.